ఊరపిచ్చుకలు

మోటూరు వీరరాఘవులు

గోపాలస్వామి పడక కుర్చీలో చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు. అతని చూపంతా యింట్లో అటూ యిటూ గెంతుతూ అక్కడ పడివున్న వడ్లగింజల్ని తమాషాగా పొట్టు ఒలిచి తింటున్న పిచికలపైనే వుంది.

కనకమ్మ వంటగది గుమ్మంలో కత్తిపీట ముందుకు లాక్కుని బీరకాయలచెక్కు తీస్తూ వుంది.

'కనకం! ఆ పిచికల్నిచూడు—యింట్లో గెంతుతూంటే ఎంత ముచ్చటగా తిన్నాయో!' అన్నాడు గోపాలస్వామి.

కనకమ్మ మూతి విరిచింది నిరసనగా.

ఆమె పలకకపోవడంవలన ఆమెవైపు విచిత్రంగా చూసిన గోపాలస్వామి కళ్ళు క్షణంలో ఎరుపెక్కాయి. 'బీరకాయలకు అంతా మందంగానా చెక్కుతీసేది? వూరికినే వస్తున్నాయనుకున్నావా యేం? కేజీ రూపాయిన్నర అమ్ముతున్నారు తెలుసా!' అన్నాడు కోపంగా.

'ఎంతచెడ్డామీ పెళ్ళాన్నేగా! ఆచెక్కులు వూరకే పారబోయనులెండి. వాటితో పచ్చడి చేస్తా' అంది కనకమ్మ.

ప్రసన్నుడై పోయాడు గోపాలస్వామి క్షణంలో.

'పెదనాన్నా! పెదనాన్నా! బడికెళ్తాను కానీ యియ్యవూ?' అంటూ జారిపోతున్న లాగును పైకి లాక్కుంటూ ఒక్కదూకున గోపాలస్వామి ఒళ్ళోకి గెంతాడు తమ్ముడు నారాయణస్వామి కొడుకు బాచిగాడు.

'ఒరే వెధవాయ్! వేలెడున్నావు అప్పుడే నీకు జేబుఖర్చుకు డబ్బులు కూడానా! జానెడు లేవు వెధవ్వి—అన్నీ తండ్రిబుద్ధులే. మీనాన్న యిలా తగలేసే ఆస్తంతా పాడుచేశాడు' అన్నాడు నవ్వుతూనే గోపాలస్వామి బాచిగాడ్ని పట్టుకోబోతూ.

'నూరుపెద్దీ! పెద్దనాన్న కానీ యియ్యనంటున్నాడు' అంటూ అక్కడనుండి తప్పించుకుని కనకమ్మ వీపుమీద పడ్డాడు వాడు.

'ఆయనంతేరా నాయనా! నేను కుడుముక్క పెడతాకాని తినిపో' అంటూ కనకమ్మ బాచిగాడ్ని వెనుకనుండి చేతులుచాపి అందుకొని ఒళ్ళోకి లాక్కుంటూ తన్మయత్వంతో వాడిబుగ్గల్ని గాఢంగా ముద్దు పెట్టుకుంది.

'నాకొద్దుఫో— నాకు కానీయే కావాల' అని మారాంచేశాడు వాడు.

'ఇందరా' అంటూ రెండుపైసల బిళ్ళ వాడిమీదకు విసిరాడు గోపాలస్వామి. దాన్ని అటూ యిటూ తిప్పిచూసి 'యిదికాదు—నాకు పెద్దకానీ కావాల' అంటూ కాళ్ళు నేలకేసి బాదుతూ దాన్ని ఓమూలకు విసిరి కొట్టాడు.

'ఆఁ! ఆఁ! ఎంతపొగ్రరా నీకు—లక్ష్మినలా విసురుకుంటారా—అలా చెయ్యబట్టే మీనాన్న అలా తిండికి తిప్పలు పడుతున్నాడు' అంటూనే ఆరెండు పైసల కోసం టేబిల్ క్రిందకు దూరాడు గోపాల

'ఏమిటండీ మీరు మరీనూ! ప్రతిదానికీ చంటివెధవ దగ్గర వాళ్ళనాన్నను తిట్టడం ఎందుకూ? ఇష్టం వుంటే యిచ్చి పంపించండి కాని—' అంది కనకమ్మ.

'ఓయబ్బ! నీమాత్రం నాకు తెలియదే మరి!—నామాటలు ప్రాడికర్ణమవుతాయా ఏమన్నానా? క్షుద్ర సన్నాసికి అప్పుడే డబ్బు ఖర్చులు నేర్పితే పాడయిపోతాడని కాని—నాకుమాత్రం వాడంటె ప్రేమలేదూ!' అంటూ టేబిల్‌క్రింద దొరికిన రెండు పైసల్ని చిక్కంలోవేసి' ఒక అయిదు పైసల బిళ్లతీసి బాబిగాడి కందించాడు గోపాలస్వామి.

'మాటలు అర్థం కావడానికి కాకపోతే అనడం దేనికీ?' అనుకుంది కనకమ్మ.

'ఇదీ చిన్నకానీయే' అని గునిశాడు బాబిగాడు.

'ఓహో—పెద్దకానీ అంటే పదిపైసలా? నీకు రోజుకు పదిపైసలంటే నెలకు మూడు రూపాయలన్నమాట. అబ్బో జానెడు వెధవ్వి నీకంత ఖర్చే యిప్పటినుండీ!' అని ముక్కున వేలేసుకున్నాడు గోపాలస్వామి.

ఇంకొక్కక్షణం అక్కడే వుంటే ఆ ఇచ్చిన దెక్కడ లాక్కుంటాడో అనుకున్న బాబి ఒక్కపరుగున బయటపడ్డాడు.

'ఇప్పుడే యిలా అంటున్నారే — వాడ్ని మనం పెంచుకుందామనుకున్నాం కదా—వాళ్ళు యివ్వక పోబట్టి సరిపోయింది కాని లేకపోతే యిలానే చూసేవారా?' అడిగింది కనకమ్మ.

'నువ్వున్నావుగా బాగా చూసుకోవటానికి' చిరాకుపడుతూ కుర్చీలో కూలబడ్డాడు గోపాలస్వామి. అతనికి తమ్ముడిపై చెప్పలేనంత కోపం వచ్చేంది.

'గాడిద కనడం నేర్చిందికానీ పెంచడం నేర్వలేదన్నట్టు—అర్థంగా సంపాదన లేక పోయినా అరడజనుమంది పిల్లలు. వాళ్ళు చూడు ఎలా వున్నారో—చిమిడిముక్కులూ, చింపిరి జుట్లూను. అయినా పౌరుషానికి మాత్రం లోపం లేదు. ఏం చూసుకొనో అమిడిసిపాటు' తనలోనే గొణుక్కున్నట్టు పైకే అన్నాడు గోపాలస్వామి.

'దేవుడిచ్చినదానికి వాళ్ళేం చేస్తారండీ! మనకింతవుంది— అయితే ఏం లాభం! అనుభవించడాని కెవరున్నారని?' స్వామి కోపంగా. 'అందుకనేగా బరువు తగ్గించడానికి వాడ్ని పెంపకం యిమ్మన్నాం. మొహమాటం లేకుండా యివ్వనని ఖచ్చితంగా చెప్పేశాడే! మింగడానికి మెతుకు లేకపోయినా అంత పంతం ఎందుకో?' చుట్ట కొస కసుక్కున కొరికి వూశాడు గోపాలస్వామి.

'పంతంకాదండీ! ఎంతమంది వుంటె మాత్రం ఏతల్లీ తనబిడ్డను యింకో అమ్మచేతిలో పెట్టడానికి యిష్టపడదు తెలుసా!' అంది కనకమ్మ.

'ఉహూ! నీకూ తెలుసునే కన్నకడుపు తీపి!' ఎగతాళిగా అన్నాడు గోపాలస్వామి. గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్టయి చురుక్కున చూసింది కనకమ్మ.

'కడుపునిండా తిండి పెట్టలేనివాళ్ళు కూడా గంపెడు మందిని కనడం ఎందుకో!' అదే ధోరణిలో మాట్లాడుతున్న గోపాలస్వామినిచూస్తే కనకమ్మకు అసహ్యం అనిపించింది. ఇలాంటి మూర్ఖులతో వాదించడం నాదే బుద్ధితక్కువ అనుకొని వూరుకుందామె.

ఇంటి దూలానికీ వాసాలకూ మధ్యనున్న ఖాళీలో పిచికలగూడు వుంది. అందులోనుండి ఒకటిరెండు రోజుల వయసున్న పిచికపిల్లలు తిండికోసం గోలగా అరుస్తున్నాయి. ఆడ పిచిక బియ్యం గింజల్ని ఏరి తెచ్చి పిల్లల నోటికందిస్తూ మళ్లీ క్రిందికి దిగుతూ ఎగురుతూ వుంది. మగపిచిక చీపురుకట్ట లోనిపుల్లల్ని ముక్కుతోలాగి గూట్లో పెట్టి మళ్లీ పుల్లలకోసం వస్తూనే వుంది. ఈ లోగా ఆ పుల్లలు, యింకా గూట్లోని మెత్తని పక్షి యీకలూ, గడ్డీ పడి యిల్లంతా చెత్తగా తయారైంది.

కనకమ్మ అదిచూసి విసుక్కుంది. 'దిక్కుమాలిన పిచికలు—యిల్లంతా చెత్త పోస్తున్నాయి. యీపిల్లలగోల ఒకటీ తల నొప్పికితోడు అంటూ చీపురుకట్టతో పిచికల్ని అదలించబోయింది. అవి తుర్రున ఎగిరి గూట్లో దూరిపోయాయి.

'ఆఁ! ఆఁ! వాటిని వెళ్లగొట్టకు. మన యింటి నాశ్రయించుకున్న నోరులేని ఆపతుల్ని వెళ్లగొడితే యింటలక్ష్మి నిలవదు' అన్నాడు గోపాలస్వామి గూటివంకేచూస్తూ.

'మీకూ జాలి వుందే' అనుకోబోతున్న కనకమ్మ—'అదీ అసలు సంగతి' అనుకుంది

'చూడు—అంత చిన్నపక్షులైనా వాటి తెలివితేటలు చూడు. తల్లిపిచిక ముందు తనకడుపు కట్టుకొని పిల్లలకెలా పెడుతోందో! ఆ మగపిచిక—ఎంత తెలివిగా సంపాదిస్తూ, యింటినీ కాపాడుకుంటుందో!—వాటికున్న బుద్ధిలో నూరోవంతువున్నా మా తమ్ముడు బాగుపడిపోను' అన్నాడు గోపాలస్వామి.

'మనయింటి నాశ్రయించుకున్న ఆ పిచికలపై మీకుండే జాలిలో—మీ రక్తం పంచుకుపుట్టిన తమ్ముడిపై నూరోవంతు జాలి మీ కుంటే అతను నిజంగానే బాగుపడి పోను' అంది కనకమ్మ.

'నోర్ముయ్! నువ్వు నాకేం చెప్పక్కర్లే' విసుక్కున్నాడు గోపాలస్వామి.

'అన్నయ్యా!' అన్నాడు అప్పుడే అక్కడకు వచ్చిన నారాయణస్వామి.

కనకమ్మ లోపలకు వెళ్లిపోయింది.

'ఏంరా! యిలా వచ్చావేం?' అను మానంగానే అడిగాడు గోపాలస్వామి, చుట్ట వెలిగించుకుంటూ తమ్ముడివైపైనా చూడకుండా.

'అన్నయ్యా! చంటిబాబుకి బొత్తిగా బాగులేదు. డాక్టరు ఏవో యింజక్షన్లు కొనుక్కోమంటున్నాడు. ఓ పాతికుంటే...' అంటూ నసిగాడు నారాయణస్వామి.

గోపాలస్వామికి చిర్రెత్తుకొచ్చింది. 'అవునా! యిలాంటి అవసరాలకే అన్నయ్య కన్పిస్తాడు నీకు. నీలాగే నాకూ యిలాంటి విషయాల్లో మొహమాటం పనికిరాదని నీకు తెలుసుగా. నన్నింకెప్పుడూ డబ్బు విషయంలో బాధపెట్టకు -- ఆఁ మర్చిపోయా ఆ యింటి తనఖా విషయం ఏం చేశావ్? కేసు డిక్రీ అయింది. ఇవాళో రేపో కోర్టువాళ్ళు వస్తే మీరంతా వీధిలో నిలబడాలి — అది ఆలోచించుకున్నావా ముందు?' అన్నాడు ఎంతో జాలిపడుతున్నట్టు.

'హఠాత్తుగా అంత సొమ్ము ఎక్కడ నుండి తెచ్చి కట్టగలను? ఎంత బతిమలాడినా మరొక్క నెల గడువుకూడా యివ్వలేక పోయావు. చేతులారా చేసుకున్నందుకు అనుభవించాలి మరి! ఇప్పుడా విషయం కాదు ముఖ్యం — చంటిబాబు చావు బతుకుల్లో వున్నాడు. వాణ్ణి ముందు కాపాడుకోవాలి.

నీకొళ్ళు పెట్టుకుంటాను: ఎక్కువైతే రూపాయలు యిచ్చావంటే నీ ఋణం జన్మజన్మలకూ తీర్చుకోలేను' పొంగి వస్తున్న దుఃఖాన్ని అదుపులో పెట్టుకుంటూ అన్నాడు నారాయణ.

'జన్మజన్మలకూ తీర్చలేని వాడికి అప్పెవరిస్తార్రా?' పకపక నవ్వాడు గోపాలస్వామి. 'ఒరే నారాయణా! కడుపునిండా తిండికూడా కరువైనప్పుడు నీకెందుకురా అంతమంది పిల్లలు? పైగా వాళ్ళకోసం ఒరా అడవు ఖర్చులెందుకు చెప్పు! ఇప్పటికే పీకలదాకా అప్పుల్లో మునిగి వున్నావ్. పోతే పోనీయ్ — చంటిపిల్లడేగా! మిగిలున్నవాళ్ళు చాలదూ నీ ప్రాణాలు కొస్తా కొరుక్కు తినడానికి!' ఆవేశాడు కూడా తేలిగ్గా సలహాయిస్తున్నట్టు.

లోపలినుండి వింటున్న కనకమ్మ నోరు నొక్కుకుంది.

చర్రున లేచిపోయాడు నారాయణస్వామి. 'ఛీ! నీదింత కటికగుండె అనుకోలేదు. నా బిడ్డ చావుకోరతావా! నువ్వు రాక్షసుడివి - నీచుడివి - పరమ లుచ్ఛావి.

'నువ్వు డబ్బుకు గడ్డి తినేవాడిగానే చిన్నప్పటినుండీ ఎరుగుదును ఇంత దుర్మార్గుడనని యిప్పుడే తెలిసింది.

'దస్త్రం పంపకంలో — ఆస్తికంటె అప్పు ఎక్కువ చూపించి, అంతా నువ్వే భరిస్తున్నట్టు నటిస్తూ నాకా ఒక్క కొలపతో కన్నీళ్ళు తుడిచి మిగిలిన బంగారం

ఊసర పతివ్రతలు

నగదూ స్వాహా చేసిననాడూ నిన్ను క్షమించాను.

'నా పరిస్థితులు విషమించి డబ్బు కోసం యిబ్బంది పడుతూ యిల్లు అమ్మకానికి పెడితే — ఆపదలో అడ్డుపడి అప్పు యిచ్చినట్టు నాటకం ఆడి వడ్డీకి చక్రవడ్డీలు కట్టి ఆఖరికి యిల్లు తనఖా వ్రాయించుకొన్ననాడూ క్షమించగలిగాను.

'నా కొడుకును పెంపకానికి యివ్వనన్నానని పగబట్టి కోర్టులో కేసు పెట్టి డిక్రీ పొంది యింటిల్లపాదినీ రోడ్డెక్కించటానికి ప్రయత్నిస్తున్నా నిన్ను సహించాను.

ఈ వేళ నా బిడ్డ చావుబ్రతుకుల్లో వుండి సహాయం కోసం వస్తే యివ్వక పోయినా సహించగలను. కాని ఒక్కమాట — నా బిడ్డ చావు కోరావు. వాడికే నిజంగా ఏమైనా జరిగిందా — నీ అంతు చూస్తాను' చలిజ్వరం వచ్చిన వాడిలా ఒణికి పోయాడు నారాయణస్వామి.

'చూద్దాం వెళ్ళిరా — నేను తల్చుకుంటే క్షణంలో జైల్లో వుంటావు' అన్నాడు గోపాలస్వామి పైకి గంభీరంగా కాని ఏ నాడూ చూడని తమ్ముడి రౌద్ర స్వరూపాన్ని చూసి నిజంగా చంపుతాడేమో అని ఆ క్షణంలో భయపడ్డాడు కూడా.

'నీరక్తం కళ్ళ జూసిన తర్వాత నేనెక్కడకు వెళ్ళినా బెంగలేదు. నాకోసం ఏడ్చేవాళ్ళయినా వున్నారు కాని గొడ్డుబోతువి — చస్తే తలకొరివి కూడా పెట్టే వాళ్ళు లేని నికృష్టపు బ్రతుకునీది — థూ!' అంటూ మరో క్షణం నిలబడకుండా వెళ్ళిపోయాడు నారాయణస్వామి.

'చచ్చిం తర్వాత తలకొరివి పెట్టక పోయినా, తవ్వి పాతకపోయినా ఎవడు చూస్తాడ్రా? బ్రతికుండగానే బలుసాకు మాత్రం తినకుండా చూసుకో!' కోపంగా పళ్ళు పటపటలాడించాడు గోపాలస్వామి.

* * *

ఎక్కడినుండో ఓ ఆడపిచిక గూట్లోకి ఎగిరి వచ్చింది. దాన్ని ఆ గూట్లోని ఆడపిచిక దాంతో కలబడింది. రెండూ ముక్కులతో పొడుచుకుంటూ కాళ్ళతో రక్కుకుంటూ, కలబడి క్రిందపడి మళ్ళీ పైకెగిరి మళ్ళీ పోట్లాడుకుంటూ యిల్లంతా ఒక కొలిక్కి తీసుకువచ్చాయి.

మగపిచిక మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఆరెంటి తగవూ ఓ ఫోటో మీద కూర్చుని చూస్తూ వుంది.

గోపాలస్వామికా సంఘటన ఎంతో ముచ్చట కలిగించింది. వంటగదిలో ఏదో పనిలో వున్న కనకమ్మను పిలిచి పక్షి చూపించి అంతా వివరించాడు.

ఆడపిచికల ముక్కుల్లోనుండి రక్తం వస్తున్నా అవి తగవు మానలేదు. ఆఖరుకు బయటి నుండి వచ్చిన ఆడపిచిక పారిపోయింది.

'చూశావా కనకం! మీ ఆడవాళ్ళల్లో ఎంత యీర్ష్య వుంటుందో' అంటూ నవ్వాడు గోపాలస్వామి.

'కడుపు నిండా పిల్లలు, భర్త కోసం ప్రాణానికి తెగించి పోట్లాడగలిగిన ధైర్యం — పిచికైతేనేం దాని బ్రతుకే ధన్యం. ఈ రాజ్యంలో మనిషి జన్మ ఎత్తిన ఆడదానికి అంతపాటి స్వతంత్రం కూడానా! మొగుడెంతమంది ముండలతో తిరిగినా పల్లెత్తు మాట అనటానిక్కూడా నోచుకోలేని ఒడవాళ్ళం — మా ఖర్మ అంతే' అంది కనకమ్మ బియ్యం చేట తెచ్చుకొని నడవలో కూర్చుంటూ.

'ఎందుకొచ్చిన ఎత్తిపొడుపులే లవి — నీకేం కొరత చేశానని? కావాల్సిన తిండీ, బట్టా, కోరిన నగలూ — నీకేం మహా



రాణివి—నీ అంత ధైర్యంగా నేనే వుండ లేను' అన్నాడు గోపాలస్వామి సగర్వంగా.

'ఏం వుంటే ఏం లాభం పిల్లామేకా లేకపోయిన తర్వాత! అందరి నోళ్ళా కొట్టి సంపాదించినదంతా ఏ దారిన పోయే దాని బిడ్డకో దక్కుతుంది. ఆఖరికి మీకు నాకూ ఏముంది మట్టిగడ్డ' అంది కనకమ్మ విసిష్టారంగా.

'నోరుమ్మయ్!' హఠాత్తుగా కనకమ్మ చెంప చెళ్ళుమంది. 'నా యిష్టం! మగ వాడ్ని కనుక చెల్లినంత మందిని వుంచు కుంటాను. నువ్వెవతెనే అడగడానికి? మళ్ళీ రంగమ్మ నింకోసారి ఏమైనా అన్నావా పీక పిసుకుతా జాగ్రత్త—దానికి పిల్లలు పుడతారేమో అని భయమైతే నువ్వే కను ఎవరొద్దన్నాడు' అంటూ మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు గోపాలస్వామి.

'నాకే పిల్లలుంటే మీ రిలా అనగలిగే వారా! ఎన్ని మాటలన్నా సహించానింత వరకూ. యీ రోజున చెయ్యికూడా చేసు కున్నారు. నేను వున్నా లేకపోయినా, మీ కొకటే. ఆ రంగిని తీసుకొచ్చి నెత్తిమీద పెట్టుకోండి. నేను మా యింటికి పోతా' బియ్యం ఒలికిపోయేలా చేటనంతా దూరంగా విసిరి లేచి లోపలకు వెళ్ళింది కనకమ్మ కళ్ళొత్తుకుంటూ.

'ఎంత పొగరే నీకు! తిని తిని కొవ్వె క్కావు — పోతే పో! యీ సారి నిజంగా రంగమ్మనే తెచ్చి యింట్లో పెడతా. గొడ్రాలివి నువ్వెలాగూ కనేదీలేదు పెట్టేదీ లేదు. దాని కడుపునైనా ఓ కాయకాస్తే— నీ గర్వం పూర్తిగా అణుగుతుందిలే' ధుమ ధుమ లాడుతూ బయటకు వెళ్ళిపోయాడు గోపాలస్వామి.

'నిజంగా నేను గొడ్రాలినా ?...!' గతాన్ని గుర్తుకు తెచ్చుకుంది కనకమ్మ. 'పెళ్ళికి ముందుమాట అది. అభం శుభం తెలియని వయసది. పట్నంనుండి ప్రక్కింటికి చుట్టపు చూపుగా వచ్చిన ఎర్రగా బుర్రగా వుంగరాల జుట్టబ్బాయి దొంగ చూపుల్తో లొంగదీసు కున్నాడు.

పదిరోజులుండి అతగాడు పట్నం వెళ్ళి పోయినా ఆ ఫలితం — నెల తప్పించింది. అమ్మా నాన్నా నెత్తీ నోరూ బాదుకొని ఏదో తినిపించి మరుసటి నెలలోనే యీ రెండో పెళ్ళివాడి కంటగట్టారు.

అప్పుడు వద్దనుకుంటే అంటుకున్నది —యిప్పుడు కావాలనుకుంటే కరువైంది. ఏవిటో మాయదారి బ్రతుకు — మన చేతుల్లో ఏముంది!' నిట్టూర్చింది కనకమ్మ.

'తప్పు యితగాడిలో వుంచుకొని నన్నంటాడేం యీ మనిషి సిగ్గులేక' అని భర్తను అసహ్యించుకుంటూనే రెండు బట్టలు సంచిలో సర్దుకుంది.

* * *

కోర్టుకు సంబంధించిన కాగితాలన్నీ తీసుకొని అర్జంటుగా బయల్దేరి రమ్మనీ, ఒక కేసు డిక్రీఅవుతుందనీ వ్రాసిన ప్లీడరు గారి వుత్తరం చూసుకొని తలుపులన్నీ బిడాయించి తాళాలు వేసి వెళ్ళిపోయినగోపాల స్వామికి—అప్పు తీసుకున్న ఆసామీ కొంప ముంచి, కొంప నుండి వెళ్ళగొట్టి, వేలంలో

అమృతాంజన్ ఇన్‌హేలర్

నిరపాయముగా, త్వరగా ముక్కు పడిశమును పోగొట్టును,
తల శీతలమును నివారించును, ఎల్లప్పుడు మీ వద్ద
ఉంచుకొండి—ఏ క్షణమైనా మీకు దాని అవసరం
మేర్పడవచ్చు. అమృతాంజన్ ఇన్‌హేలర్ చేత నుంచుకోడానికి
అనువైనది. సులభంగా వాడవచ్చు. తక్కువ ఖరీదు.

తయారుచేయువారు:
అమృతాంజన్ లిమిటెడ్ మద్రాసు-4.

FDSAIH1012TE

అందరిళ్ళో గూళ్ళు కట్టి తక్కువ ధరకి ఆ కొంపను తనే కొనేసి విజయగర్వంతో యిల్లు చేరడానికి మూడురోజులు పట్టింది.

తలుపులు తెరిచి చూసిన గోపాలస్వామి విభ్రాంతుడై పోయాడు,

పిచికపిల్లలు నాలుగూ నేలమీద చచ్చి పడి వున్నాయి. తలుపులు తెరిచిన తక్షణం లోపలకు వచ్చిన పెద్ద పిచికలు రెండూ ఆ చచ్చిన పిల్లలచుట్టూ తిరుగుతూ గెంతుతూ గోల గోలచేసి పారేస్తున్నాయి.

ఊరపిచ్చుకలు

మానవత్వం మర్చిపోయిన గోపాలస్వామి మనస్సుకూడా ఆ క్షణంలో—ఆ దృశ్యానికి చలించిపోయింది. 'అయ్యో పాపం! నేను చూసుకోకుండా యీ పెద్దపిచికలు బయటకు వెళ్ళినప్పుడు తలుపులు బిగించి వెళ్ళి పోయి వుంటాను. ఈ మూడురోజుల్లోనూ తిండిలేక యీ పిల్లలు చచ్చిపోయాయి. పిల్లలకోసం యీ పెద్దవి, వీటికోసం ఆ పిల్లలూ ఎంతగా తల్లడిల్లిపోయాయో కదా!' అని వూరికే తనకు తెలియక చేసిన పొరపాటుకు కూడా ఎంతో నొచ్చుకున్నాడు గోపాలస్వామి.

అతని దృష్టి గోడమీది దేవునిపటంపై పడింది, 'తండ్రీ! ఏనాడు చేసుకున్న పాపమో యీ జన్మలో నాకు పిల్లలు లేకుండా చేశావు. మళ్ళీ ఎందుకు నాచే యీపాపం చేయించావు? యింతటితో నాకు విముక్తి లేదా?' అంటూ జీవితంలో మొదటి సారిగా దేవునిముందు తన తప్పు ఒప్పుకున్నాడు గోపాలస్వామి చేతులు జోడిస్తూ.

మరుక్షణం అతనికి తనతమ్ముడు గుర్తుకు వచ్చాడు.

వెంటనే చెప్పుల్లో కాళ్ళు తియ్యకుండానే యింటికి తాళంవేసి బయల్దేరబోతున్న గోపాలస్వామికి కోర్టు బంట్రోతు ఎదురు వచ్చాడు.

'మీరే బయల్దేరారా! కోర్టు అమీనా గారు మిమ్మల్ని అర్జంటుగా తమ్ముడిగారింటికి రమ్మన్నారు' అన్నాడు బంట్రోతు.

ఇద్దరూ అక్కడికి చేరేసరికి నారాయణస్వామి భార్యచంటి కుర్రవాడి శవాన్ని ఒళ్ళోపెట్టుకొని భోరున ఏడుస్తూ వుంది. తల్లిని చూసి పిల్లలు మరీ గోలగా ఏడుస్తున్నారు. నారాయణస్వామి కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వెలుగుతూ గోపాలస్వామి దిక్కుగా చూస్తున్నాయి.

ఆచూపును ఎదుర్కోలేని గోపాలస్వామికి అక్కడి దృశ్యం గుండెల్ని బరువెక్కించింది. అప్పుడే పెదనాన్నా అంటూ ఏడుస్తూ వచ్చిన బాచిగాడ్ని ఎత్తుకొని గుండెల కదుముకుంటూ నోటమాటరాక చేతితో అవినాచెయ్యి పట్టుకొని బయటకు వచ్చేశాడు గోపాలస్వామి.

రెండు వూరపిచ్చుకలు అప్పుడే అలా ఎగిరి పోతున్నాయి—గూటికో—కూటికో!!!

డాక్టర్ విక్రం. ఎ. శారభాయి

అణుశక్తి కమీషన్ చైర్మన్, భారతప్రభుత్వపు అణుశక్తిశాఖ కార్యదర్శి అయిన డా. విక్రం శారభాయి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన భౌతిక శాస్త్రవేత్త. వారి పరిశోధనలు అనేక ఆధునిక రంగాల్లో వున్నాయి. అణుశక్తి, కాస్మిక్ కిరణ ప్రసరణాలు, అంతరిక్షం — వీటన్నిటిలో డా. శారభాయికి ఆసక్తివుంది. అణ్వస్త్రాల వుపయోగం వల్ల కలగనున్న ప్రభావాల గురించి వివిధ దేశాలు ఎక్కువగా అణ్వస్త్రాలు సేకరించడంలో ఆర్థిక, రక్షణ సంబంధమైన ప్రమాదాలను గురించి ఐక్యరాజ్యసమితి వున్నత కార్యదర్శికి సలహాలిచ్చే నిపుణుల సంఘంలో ఆయన పనిచేశారు. అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనలకు వినియోగించుకోడానికి ఐక్యరాజ్యసమితి వారు ఏర్పాటు చేసిన సమావేశానికి, నిపుణుల సంఘానికి చైర్మన్‌గా కూడా పని చేసారు.

డా. శారభాయి జననం 1919లో. అహమ్మదాబాద్‌లో గుజరాత్ కాలేజీలో చదువుకున్నారు. తరువాత బెంగుళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సర్ సి. వి. రామన్ వద్ద పరిశోధనలు జరిపారు. 1947లో కేంబ్రిడ్జి యూనివర్శిటీలో పి. హెచ్. డి. తీసుకున్నారు.

డా. శారభాయి అహమ్మదాబాద్‌లోని భౌతిక శాస్త్రపరిశోధనా సంస్థకి, తుంబాలోని అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి కూడా డైరెక్టర్‌గా వున్నారు. గత 10 సంవత్సరాల్లోను అమెరికాలోని మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (యం. ఐ. టి.) ని అనేకసార్లు దర్శించి అక్కడ అంతరిక్షానికి సంబంధించిన పరిశోధనలు చేసారు.

డా. శారభాయి భారత జాతీయ అంతరిక్ష పరిశోధనా సంఘానికి, ఇండియన్ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్‌కి చైర్మన్. నిరాయుధీకరణగురించి అనేక అంతర్జాతీయసమావేశాల్లో పాల్గొన్నారు. అంతర్జాతీయ వైజ్ఞానిక సంఘాల సమితిలోను, సూర్యగ్రహానికి సంబంధించిన భౌతిక శాస్త్ర ఇంటర్ యూనియన్ కమీషన్‌లోను సభ్యులు.

1947—55లలో అహమ్మదాబాద్ నేత పరిశ్రమ పరిశోధనాసంస్థకు గౌరవ డైరక్టరుగా పనిచేశారు. 1962—65 లలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మానేజిమెంట్‌కి (అహమ్మదాబాద్) కూడా గౌరవ డైరక్టర్. 1956లో జపాన్ దర్శించిన భారత ఉత్పత్తి ప్రతినిధి వర్గానికి నాయకులు.

మనదేశంలోను, విదేశాల్లోను అనేక వైజ్ఞానిక సంస్థల్లో సభ్యులు. అంతర్జాతీయ వైజ్ఞానిక పత్రికల్లో అనేక వ్యాసాలు ప్రచురించారు. వీరి భౌతిక శాస్త్ర పరిశోధనలకి 1962 లో శాంతి స్వరూప భట్నాగర్ అవార్డు లభించింది. 1966లో పద్మభూషణ బిరుదు వచ్చింది.

— డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి